# రాగరంజితం

ఆత్మార్పణ కేవలం స్త్రీకి మాత్రమే సాధ్యమంటే విజ్ఞులు కాదనలేరు. పురుషుని జీవితంతో, అందునా మనసార ప్రేమించిన వాని జీవితంతో చెలగాటమూ స్త్రీకి మాత్రమే చేతనవును. అదేమి విచిత్రమో!

**పులికంటి కృష్ణారెడ్డి**

"టక్.....టక్.....టక్"

భయగ్రస్తుడైన మానవుని గుండెదడలా, కీ ఇచ్చిన గడియారంలోని శబ్దంలా వినిపిస్తూంది! ఏమిటీధ్వని?

"టక్...టక్...టక్...టక్...టక్...టక్..."

అదో! లయతప్పని తాళంలా ఇంకనూ వినిపిస్తూనే ఉంది. ఏమిటీ శబ్ద పరంపర? హేమంత శశాంకుడు వెన్నెలవాగులను ప్రవహింపచేసే ఈ చల్లని రాత్రి ఎక్కడ పుట్టి విచ్చలవిడిగా ప్రవహిస్తూందీ శబ్ద ప్రవాహం?

సందేహ నివృత్తి కావాలంటావా? అయితే



ఒక్క క్షణం నిలబడు! అదుగో! అటుచూడు. ఊరివెలుపల ఆరుబయట తిరుమలకొళ్ళో తారు రోడ్డుకు బారెడు దూరంలో రేరాజు క్రుమ్మరించే వెన్నెల నురుగుల స్రవంతిలో పూవుల తెప్పలా తేలిపోతూంది ఓ సౌధరాజం!

చుట్టూరా మోకాటిబంటి ప్రహరీగోడ. అందులో అందాల మేడ. మంద పవనంతో వివిధ విలాస గతుల నాట్యంచేస్తూ ఆ మేడను కైవారం చేస్తున్న పూలకన్నెలూ....ఓహ్! శరచ్చంద్ర చంద్రికా జ్యోత్స్న వికసిత పీచికల ప్రసరింపుతో ఎంత అందంగా ఉందామేడ!

అదో! అక్కడే....ఆ ప్రహరీగోడ ఒక మూలగా ఓ చిన్నారి చిగురుబోడి చేతిలోని చీవురు కట్టలా ఉందొక పర్ణశాల! ఆ పర్ణశాల ముందు పందిరి క్రిందచూడు! మసిపూసినట్లు పెరిగిన గడ్డము, శరీరమాద్యంతం నిండిన తెల్లటి ధూళి, నిశితమైన చూపులు, అంతకంటె నునిశితమైన ఉద్విగ్నత, ఎడమచేత ఉలి, కుడిచేత సుత్తె, ఈ రెంటి సంధింపులో 'టక్‌టక్' మన్న శబ్దం! పర్వతశ్రుతిలా కూడగట్టుకొని సవ్యసాచిలా పనిచేస్తున్నాడు. ఎవ్వరీవ్యక్తి?

ఎవ్వరో! రాతిని నాతిగా తీర్చి పర్వ ప్రపంచాన్ని సమ్మోహపరచాలని సంబర పడుతూ సృష్టికి ప్రతిసృష్టిచేయుగల కళా తపస్వి! అతడొక మహాశిల్పి! అతని పేరు ఆనంద్.

ఆనంద్ ఆరునెలలుగా అహోరాత్రంఆకుంఠిత దీక్షతో బండపైన ఓ సుందర సుకుమారిని సృష్టించ ప్రయత్నిస్తున్నాడు. విద్రాహారాలు కూడ మాని నిరంతరమూ తన తపస్సులో లీనమైపోయాడు. అతనికి తన కళారాధన ముందు ప్రపంచమంతా నిరాధారంగా కనిపిస్తుంది.

ఆ ప్రక్కనే, మెత్తని పరువులా పెరిగిన పచ్చని పచ్చిక మీద బోర్లగిల పడుకొని, గులాబీలు పూసి అరుణరాగరంజితాలయిన చెక్కిళ్ళను చిరుచేతులతో కప్పుకొని, భావనోద్యానంలో పూసిన మల్లెపూలు రాలి బయటపడుతాయనేమో మధురాధరాలను ఒకించుక అదిమిపట్టి, పడగ విప్పిన త్రాచులా తలపైకెత్తి వాలుచూపులతో, వలపు బరువుతో, వేడినిట్టూర్పులు వెదజల్లుతూ ఉత్సాహ సంభరితమైన ఆ చల్లని రాత్రి వేదనా భరితంగాఉంది ..... ఎవ్వ రీ చిన్నారి?....

ఆనంద్ చేతిలో అపురూప రూపాన్ని ఆపాదించుకొన్న అందాల శిల్పమా? కాదు. అది బ్రహ్మ నిర్మితమైన స్త్రీ రూపం. అందానికి ఓ ప్రతి స్వరూపం.

ఆ లతాంగి అతని అర్ధాంగి! పేరు సునంద.

"ఎంత అందంగా ఉందండీ!"

కనురెప్పలు 'అలా అలా' అల్లార్చి, పెదవి పట్టును కాస్త సడలించి మురిపెంగా, మధురంగా పలికింది సునంద. అతని వీనుల్లో తేనెవాగులు ప్రవహించాయి. అమృతపు ఝరి చిందింది. ఒక్క

# రాగరంజితం

లిప్తకాలం 'టక్ టక్' మన్న శబ్దం ఆగిపోయింది. ఆ సదవకాశాన్ని జారవిడుచుకోకుండా అతని పర్యావయాలూ సేద దీర్చుకొంటున్నాయి. మందస్మిత వదనంతో మధురంగా ఒక్కసారి సునందవైపు చూచాడు.

"అవును, సునందా! ఈ అందాన్ని సృష్టించ డానికేకదూ నా ఈ అవిరళకృషి! నా ఊహా సుందరి అందం ముందు ప్రపంచమంతా తలఒగ్గాలి! తల ఒగ్గడమేమిటి? ప్రపంచంలోని అందాన్నంతా క్రోడీకరిస్తే నా సుందరి కాలి కొన గోటికి...." సంతృప్తిలో తేలిపోతున్నాడు ఆనంద్.

"అబ్బబ్బ! చాల్లెద్దురూ! ఎప్పుడు చూడు 'ఊహా సుందరి! ఊహాసుందరి!!' అని ఒక్కటే గొడవ... ఇంకెవరూ సుందరులే కానట్టు!"

ఉలిమీద ఖణిల్లని సుత్తె దెబ్బ పడింది.

సునంద చికాకుపడిపోయింది.

"మరి! నీవే అన్నావుగా అందంగా ఉందని!" —ఏదోచెప్పుదామని ఆప్యాయంగా దగ్గర చేరిన పసిపిల్లవాణ్ణి కసరి కొడితే బుంగమూతిపెట్టి చెప్పదలచింది చెప్పినట్లుంది ఆనంద్ మాట.

"అదికాదండీ!"

"ఇంకేది?"

"ఈ పున్నమినాటి పండు వెన్నెల... హృదయాన్ని గిలిగింతలు పెట్టే ఈ చల్లని పిల్ల గాలులు... లేతనీలిరంగు చీరకు చుట్టూ పచ్చని అంచులా నిర్మలాకాశాన్ని చుట్టే ఈ పర్వతాలు... ఆ పర్వతాల్లో పరవళ్ళు త్రొక్కే పరవశత్వంతో ఒళ్ళు మరచి తిరిగే చకోరాలు.... ఓహో!"

"ఆ! ఆ!! ఆ పర్వతాల సమీపంలో మన



అక్కా చెల్లెళ్ళు

చిత్రం— వి. జగన్నాథశర్మ (బొంబాయి-38)

ఇల్లు, ఇంటి ప్రక్కన బాట, బాట ప్రక్కన తోట.... ఆ తోటలో చెట్లు... ఆ చెట్ల మధ్య మేము... నా ప్రక్కన నువ్వు.....ఓహ్! ఎంత అందంగా ఉన్నాం!" మధ్యలో అందుకొని సునంద మనోభావాలను వ్యంగ్యంతో పూర్తి చేశాడు ఆనంద్. ఓ సన్నని రాతి పలుకు ఎగిరి సునంద కళ్ళల్లో పడింది. ఆమె కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

మరలా ఓ అయిదు నిమిషాలు నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకొని అనంత వాయువులో కలిసిపోతూంది 'టక్ టక్' మన్న శబ్దం.

అప్పటికి సరిగ్గా ఆరు నెలల క్రిందట ఓ రోజు, ఆదివారం, ఉదయం పదిగంటలై ఉంటుంది. తాను గదిలో పరికరాలన్నీ సరిచూచుకొని వంటమీద దండయాత్రకు సన్నద్ధురాలవుతూంది. ఆ దండయాత్రకు సైన్యాన్ని ప్రేరేపించడానికన్నట్లు ఆనంద్ "సునందా! సునందా!!" అని అరుస్తూ వంట గదిలోనికి ఒక్కదూకు దూకాడు.

"చూడు, సునందా! ఈ దెబ్బతో ఆంధ్ర దేశం హడలిపోవాలి. ఇన్నాళ్ళు నన్ను కుక్కిన పేనులా త్రొక్కిపెట్టినందుకు ఆంధ్రులంతా అలమటించిపోవాలి! అరె, ఎందు కలా నవ్వుతున్నావు? నా మాట నిజం, సునందా! కావలిస్తేచూడు" అంటూ చేతిలోని దిన పత్రిక అందించాడు.

"ఏందుకండీ, ఆ ఆవేశం? మీ కృషి ఎందుకు ఫలించదు? ఇంతకూ ఇప్పుడు ఫలించకుండేగా!" అని కొంటెగా నవ్వుతూ పత్రిక అందుకొంది.

"ఆంధ్ర శిల్పులకు పోటీ! అత్యున్నతమైన శిల్ప సృష్టికర్తకు గండపెండేరం తొడిగి ఏనుగుమీద రాజధానిలో నాలుగు వీధులు ఊరేగింపు."

ఆ దిన పత్రికలోని ప్రకటన చూచి సునంద హృదయం గర్వంతో తొణికిసలాడింది. హైదరాబాదునగరం అమరావతి అయితే అందులో ఐరావతం లాంటి ఏనుగుమీద అందాల అంబారీలో ఊరేగుతున్న తన భర్తను కనుల ముందు చిత్రించుకొని తన్మయత చెందింది. అంతేగా మరి!

'ఏమండీ! మొన్న వారపత్రిక చదివారా? అందులో ఫలానా కథ వ్రాసిందెవరనుకున్నారు? .....మా ఆయన!'— 'మొన్న కోనేటి కట్టమీద బహిరంగసభలో ఇంటి పన్ను తగ్గించాలని ఏకధాటిగా మాట్లాడింది మావారే నండీ!' అని చెప్పుకొవడానికి ప్రతిఆడదీ గర్వపడుతుంది. సునంద అలాంటివారి తోబుట్టువేగా మరి! అందుకే అతని కన్నివిధాల ప్రోత్సాహమిస్తూ చేదోడువాదోడుగా ఉంది.

"ఏమండీ!"

"ఊ!"

"ఈ ఒక్క రాత్రి......"

"అవును సునందా! ఈ ఒక్క రాత్రితో నా తపస్సు పండిపోవాలి. ఈ దిగంత సుందరిని సూర్యోదయాత్పూర్వమే ఈ లోకంలోనికి దింపి నడిపించాలి. ఆమె అడుగుల సవ్వడికి, నాట్యభంగిమల నైపుణ్యానికి ప్రపంచమంతా అడుగులకు మడుగులొత్తుతూంటే...." కృషి కుంటుపడకుండా అవధానం చేస్తూ ఆనంద లహరిలో తేలిపోతున్నాడు ఆనంద్. సునంద తన లక్ష్యానికి పూర్తిగా విరుద్ధమైన అతని నిర్లక్ష్యాన్ని చూసి పొలిపోతూంది. మనసు నిండి గుండెను పిండే మధురాతి మధురమైన అనుభూతులను అణచుకోలేని అవస్థ. పట్టు పడ్డ పాములా, పరిమళాన్ని వెదజల్లే అగరు ధూపంలా మెలికలు తిరిగిపోయే తనువు. ఆమె ఓర్పు సన్నగిలిపోయింది!

"మిమ్మల్నేనండీ!"

"ఊఁ!"

"ప్చ్! ఇలా చూడండీ!"

"ఊఁ! ఊఁ!!"

"యమునాతీర శాద్వలాల మీద చల్లని పిల్ల తెమ్మెరలు శైత్యోపచారం చేస్తూంటే, 'రాధమురా! విరహరాధమురా!!' అని ప్రార్థించిన రాధను గోపాలుడు తన మురళీగాన మాధుర్యంతో ముంచివేసింది ఇలాటి వెన్నెల్లోనే కదూ!"

"అవును, సునందా! నేనూ ముంచేస్తాను ఆంధ్రదేశాన్నంతా ఆశ్చర్యంలో, ఈ అపురూప సుందరిని సృష్టించి!" గుక్కపట్టి ఒక్క మాట పలికి మరల తన పనిలో లీనమయ్యాడు ఆనంద్. సునంద ఓర్పు పూర్తిగా నశించింది.

"అలాగే ముంచేద్దురుగాని, ఈ పూటకు పని చాలిద్దురూ!" ప్రాధేయపడింది సునంద.

"ఎందుకూ?!"

"ఎందుకా!" అని తన బాహా యుగళంతో అతని కంఠాన్ని బంధించింది సునంద. మనసు వెల్లివిరిసిన విరజాజుల్లాంటి కోరికలను కను కొలకుల్లో నిలిపి, ఒక్కటొక్కటిగ అతనిపై విసరుతూంది మన్మథ బాణ పరంపరల్లాగ! ఆమె హృదయం, అతని హృదయానికి మరింత దగ్గరగా జరిగి, ఏదో మర్మ బాధను మననిచేసి, సన్నని లేకపోయేసరికి మండిపడి, వేడి నిట్టూర్పులు వెదచల్లుతూంది. చెప్పుకోలేని తపనతో విరహతాపంతో ఆమె అధరాధరమ్ములు అదిరి పడుతున్నాయి.

శిల సహవాసంతో ఆ శిల్పి శిలాసదృశమైపోయాడేమోమరి! కాస్సేపు ఆమెను కన్నార్పకుండా విలోకించి, ఓ చిరునవ్వుతో తల పంకించి మరల తన పనిలో మునిగిపోయాడు.

'ఛీ! ఏమిటీ మనిషి! గుండెలేని బండ! అందుకే బండతో మాట్లాడుతున్నాడు. ఇతనితో కాపురం రాతిమీద సేద్యమేనేమో!' మనసులో పుట్టిన ఈ భావన మెదపట్టి గెంటేసరికి విసరిన పూబంతిలా, తారాజువ్వలా, రివ్వునపోయి పడక టెంటిలో పరుపుమట్టమీద ఇరుసు విరిగి పడిన బండిలా కుప్పగా కూలిపోయింది. ఆమె మనో భావాలు అలలు అలలుగా పెనక్కు తేలిపోతున్నాయి......

* * * *

కొండ చరియను 'ఒడి' అంటారు గ్రామీణులు. అలాంటి మూడు 'ఒడులు' చేరి అడుగు భాగం వలయాకారంగా ఉండేట్టుగా ఓ లోయను సృష్టించాయి. ఆ లోయ మధ్యభాగంలో ఈ కొండలు కోట గోడల్లా రక్షిస్తూంటే సురక్షితంగా ఉంది 'కన్నికాపురం!' ఆ పల్లెలోనే సునంద కన్యగా కాపురం చేసింది.

జీవితంతో కొట్టు మిట్టాడి కాల గర్భంలో కలిసి పోయిన శిథిల జీవితాల స్మృతిచిహ్నంగా నిలబడ్డ నాలుగైదు ఇండ్ల మొండి గోడలు, ఓ అయిదారు పెంకుటిండ్లు, పది పదిహేను పూరిగుడిసెలు—వీటన్నిటినీ ఉద్ధరించడానికి అవతరించిన అవతార పురుషుడులా ఊరికి ఉత్తరంగా ఓ పెద్ద మేడ. ఊరికి మధ్యగా ఓ పాడుపడ్డ దేవాలయం. ఇదీ ఆ పల్లె సర్వే!

'ఏమిటీ మారుమూల పల్లెలో ఇంత పెద్ద మేడ ఉందే!' అనుకొని, కాస్త వయస్సు మళ్ళిన ఎవరినైనా పిలిచి "ఆమేడ ఎవరిదయ్యా?" అని అడిగితే, "శిరిపిరెడ్డి చిన్నమరెడ్డిది!" అంటారు. అడిగిన దానికి బదులు చెప్పాంగదా, అంతటితో పని తీరిపోయిందనుకోకుండా మరల అతడే ఇలా చెప్పుకుపోతాడు.

"అదో అటు చూడు! ఆ మహాడీ ప్రక్కన మొండి గోడలు! కనబడలా! ఆఁ! ఆఁ! అవే! అవే!! పాతికేళ్ళ కిందట ఆ మొండి గోడలమీద పూరిల్లు, ఇప్పుడే మేడయింది నాయనా!" అంటాడు. "ఇదెలా జరిగింది?" అన్న ఆశ్చర్యంలో నుండి తేరుకోవడానికన్నట్లు కాస్త విరామ మిచ్చి, మరల ఆరంభిస్తాడు.

"ఆ పూరింట్లో ఈ చిన్నమరెడ్డి భార్యతో ముండమోపి కొంపచేరిన చెల్లెలితో బోడి తలకు బొటనవ్రేలికి ముడిపెట్టినట్లు కాపురం చేస్తుండేవాడు. తన దనిపించుకోవడానికి జానెడు భూమిలేదు. గుత్త సేద్యంతో కడుపు నూడేది. అలాంటివాడి బ్రతుకు ఉన్నట్టుండి మారిపోయింది. సుమారు నూరెకరాల పొలంబోకునేం అతడి పేరిట పట్టా అయిపోయింది. ఆ పొలం బంగారు పండింది. అతడు పట్టింది బంగారయింది. చిన్నమరెడ్డి కోటికి పడగెత్తాడు. ఇదంతా అతనికి కూతురు పుట్టిన వేళా విశేష మన్నారు ఊళ్ళో వాళ్ళంతా!"

"పోనీలెండి! ఎలాగో బాగుపడ్డాడు. అంతే చాలు!" అని నోరు తెరిచి మానవ సహజమైన సానుభూతి చూపావా? "ఆఁ! ఏం బాగుపడ్డాడో! నా తాడు...చచ్చేదాక శాంతిలేని బతుకు!" అని నాపోతాడు.

"అదేమిటండీ! అలా అంటారు?" అంటే—

"చూడు, నాయనా! వాళ్ళూ, వీళ్ళూ అనడమే కాదు. కూతురు పుట్టాక తరువాతే తన బ్రతుకు బాగుపడిందని చిన్నమరెడ్డి కూడ ఒప్పుకుంటాడు. అందుచేత ఆ పిల్లదానిపైన ఈగ వాలకుండా, వెన్నమీద గువ్వలా సాకి సంతరించినాడు. ఆడదానికి చదువెందుకనుకోకుండా బి. ఎ. దాక చదివించినాడు. అయితే మాత్రం ఆ అమ్మి అలా చెయ్యడం ఏమన్నా బాగుందంటావా? ఆహా! చెప్పు నాయనా!" అంటూ ప్రాధేయ పడతాడు.

బహుశా ఆ ప్రాధేయపడడం చిన్నమరెడ్డి మీద సానుభూతి కావచ్చు. లేదా తన మనస్సే ఆ బాధ పడవచ్చు. కానీ, ఆ అమ్మాయి చేసిందేమిటో తెలియకుండా మంచి చెడ్డల నిర్ణయించడ

## కొండలలో

**చిట్టా దామోదర శాస్త్రి**


ఆ దూరపు కొండలలో
అది ఏముందో గానీ
పరమ మోహనాకృతులై
బంధించెను నా చూపుల.

కొమ్మ జంట వలెను కొండ
కొనలు రెండు కనిపించెను;
మూపురమ్ముగా పొల్చెను;
మూడవ శిఖరము వెనుకగ
నందిదేవు డచట పండె
నా యని నా కనిపించెను.

కొండవాలు తుండము వలె
దండి మొదలు బొజ్జగాను
కొండొక టగుపించెనహో
కూర్చుండిన వినాయకుడె.

హేమంతోదయపు తెలల
ఇనకరములు మెఱయింపగ
వెండికొండ పోలికలే
వెలసిన నా చిన్ని కొండ.

ఎంత పుణ్య మొనరించిరొ
ఈ కొండలు జనియించెను;
జడమూర్తిగ కనిపించియు
చైతన్య మ్మొలికించును;
పరమ శివం కరమ్మలై
భాసించును నా యెడదను.
*



కుతుబ్ మినార్ నుంచి — ఫోటో—ఎల్. ఆర్. గ్రోవర్ (రొహతక్)

మెలా? ఈ మాత్రం ఆలోచించుకోవడానికి వ్యవధి ఇవ్వకుండా మరలా అతడే, ఆ మేడను గురించి ప్రశ్నించిన ప్రతివాడికీ విషయాన్ని పూసగ్రుచ్చినట్లు చెప్పడం తన ధర్మంగా భావించి చెప్పుకుపోతాడు.

"నాయనా! ఏనుగు మింగిన వెలగపండులా మాయమయ్యే సంపద, వచ్చేటప్పుడు టెంకాయలో నీళ్ళలా వస్తుందంటారు పెద్దోళ్ళు. అచ్చంగా అలా మారింది చిన్నమరెడ్డి బ్రతుకు. దానితో ఆయనకు కాస్త మంచి బుద్ధి కలిగి ఊళ్ళో ఒక దేవాలయం కట్టించా లనుకున్నాడు. ఏముంది? అనుకొన్నదే తడవు. చేతినిండా డబ్బు. దేవుడి కార్యం కాబట్టి పిలిస్తే పలికే జనం. ఆరు నెలలకంతా దేవాలయం దివ్యంగా తయారయింది. ఆమీదట దేవుడి విగ్రహం తయారు చేయడానికి ఓ శిల్పి కావలసి వచ్చాడు. ఎక్కడెక్కడ తిరిగాడో, ఎన్ని కష్టాలు పడ్డాడో చిన్నమరెడ్డి పాపం! ఎక్కడో చెట్టుక్రింద కూర్చుని పిచ్చి పిచ్చి బొమ్మలు గీస్తుండిన ఓ శిల్పిని పట్టుకొచ్చాడు. అబ్బబ్బ! ఆ గడ్డం, ఎలుంగొడ్డు వెంట్రుకల్లా చిక్కుబొడుచుకొని బాగా మాసిన తల, చినిగిన పేలికలు—ఎంత వికారంగా ఉన్నాడంటే, అప్పుడే అడవినుండి పట్టుకొచ్చిన 'అడవి మనిషి'లా ఉన్నాడు. అబ్బ! తలచుకొంటేనే ఒళ్ళు జలదరిస్తుంది. కానీ, నాయనా! వాడి కళ్ళల్లో కాంతి ఉంది. వాడి

# రాగరంజితం

చేతిలో పని ఉంది. అబ్బా! రాళ్ళు నవ్వేవాయంటే నమ్ము!

"అతగాడు ఈ ఊళ్ళో ఏడాదిపాటు పని చేశాడు. తన పనేమో, తానేమో తప్ప అతనికి బాహ్య ప్రపంచంతో అవసరమున్నట్లు కానీ, అతని అవసరం ఇతరుల కున్నట్టుగానీ కనిపించదు. ఆ ఏడాదిపాటు చిన్నమరెడ్డి కూతురు ఆఁ! ఆ పేరు కూడ సరిగా మతికొచ్చి ఏడవదు— మేమేంది ఈ పల్లెల్లో పల్లక్క, పుల్లక్క అని పేర్లు పెట్టుకుంటే, చిన్నమరెడ్డి ముద్దుల కూతురికి పెద్ద పేరే వెతికిపెట్టాడు. సమయానికి మతికి రావంటుందే! ఆఁ! ఆఁ!! సునంద! ఆమె సపర్యలు చేస్తుండేది. ఈ కాలం ఉంది చూశావూ! దొల్లు పుచ్చకాయలా దొర్లిపోవడం ఎంతసేపు, నాయనా! కనుమూసి తెరచేలోపల అట్టే సంవత్సరం గడిచిపోయింది. దేవుడి విగ్రహం బ్రహ్మాండంగా తయారయింది. ఆ శిల్పి కూడ కాస్త చిగురుపెట్టి మనిషిగా తయారయ్యాడు. గుడిని, గుళ్ళో దేవుణ్ణి చూడ్డానికి ఆపడ దూరంనుండి సద్దికూడు మూటలు గట్టి నడుస్తున్నారు జనం. దానితో తన జన్మ తరించిందని చిన్నమరెడ్డి పొంగిపోయాడు. పెమ్మూరునుండి పిచ్చయ్య శాస్త్రిని పిలిపించాడు. ఈ పిచ్చయ్యశాస్త్రి నాయనా! పంచాంగం పట్టి లగ్నం పెట్టాడంటే ఈ పక్క పుట్టే పొద్దు ఆ పక్క పుట్టినా లగ్నం మాత్రం పొల్లుపోదు. ఆయనే విగ్రహ ప్రతిష్ఠాపనకు లగ్నం పెట్టాడు. కానీ ఈ దఫా పిచ్చయ్యశాస్త్రి పప్పులో కాలువేశాడు. ఆ లగ్నం కాస్తా పూసిపోయింది!

"ఎలా పూసిపోయిందని అడక్కుండా అలా గుడ్లప్పగించి వింటుంటే సరిపోతుందా? హ్హ హ్హ హ్హ.....ఇదో చెపుతా!" అంటూ కాస్త పొగాకు కాడను త్రుంచి నోట్లో ఒరికి ఆమీదట తాపీగా ఆరంభిస్తాడు.

"సరిగా ఆ లగ్నానికి ముందటి రోజు రాత్రి. చిన్నమరెడ్డి ఇంటి కూటమి. మరునాడు జరుగనున్న కార్యాన్ని గురించి ఆలోచిస్తూ ఊళ్ళో పెద్దలంతా అక్కడ చేరారు. అందులో నేనూ ఒకణ్ణి. తలకొక్క తీరుగా మాట్లాడుతూండే అటూలున ఆపేశారు. చిన్నమరెడ్డి కూడ కాస్త కలవర పడ్డాడు. వేళకాని వేళ సునందమ్మ రావడమే దీనికి కారణం.

'ఏం తల్లీ....ఏం కావాలి?' కూతురు దగ్గరచేరి గోముగా అడిగాడు చిన్నమరెడ్డి.

'రేపేగదు నాన్నా!....విగ్రహ ప్రతిష్ఠాపన!!'

'అవు నమ్మా!'

'సరి! ఆ సమయంలోనే నా వివాహం కూడ జరిగిపోవాలి నాన్నా!'

'ఏమిటమ్మా, నువ్వు మాట్లాడేది? నీ కేం పిచ్చి పట్టలేదు గదా!'

'పిచ్చి, మతిభ్రమణ, చైత్యం ఇలాంటి వేమీ లేవు నాన్నా! ఆ చింత మీ కనవసరం. నేను బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. ఆ దేవుడి సాన్నిధ్యంలోనే నా వివాహం జరిగితీరాలి!'

'ఇంతకూ వరు డెవ్వరమ్మా!'

'శిల్పి, ఆనంద్!'

'ఆఁ! ఏమిటమ్మా నువ్వు వాగేది? నీ కేమీ మతి చలించలేదుగదా! మన తాహతు, అంతస్తు ఏమైనా ఆలోచించావా లేదా? ఈ పాడు బుద్ధి......'

'నాన్నా! తాహతు, అంతస్తులను మనం సృష్టించుకొంటున్నామే కాని జన్మతః ఎవ్వరికీ రాలేదు. నే నతనిని భర్తగా పొందుతున్నానంటే అది నా పూర్వజన్మ సుకృతం!'

"తొణకని కుండలా సునంద సమాధానం చెప్పింది. దానితో చిన్నమరెడ్డి చిత్తయి పోయాడు. 'ఛీ! నా కడుపున చెడపుట్టావు. నీ మొగం చూడను. నువ్విలా చేస్తే నేనే నుయ్యో గొయ్యో చూసుకొంటాను' అని బెదరించాడు. లాభం లేకపోయేసరికి 'నా మాట విను తల్లీ. రేపు ఇదే లగ్నానికి వివాహం జరిపిస్తాను. మన బంధువర్గంలో ఎవరైనా సరే చెప్పమ్మా!' అని బ్రతిమలాడాడు. ప్రయోజనం

(తరువాయి 50 వ పేజీలో)

లేకపోయింది. చిన్నమరెడ్డి దెబ్బతినాడు. ఎంత పెద్ద కడుపుతీపి పెద్దది వాయనా! పైగా, అమె ఆ ఇంటి మహాలక్ష్మి అయె! ఏమీ మాట్లాడలేకపోయాడు. ఏడుపు ఎగ్గొట్టు కొస్తోంది. రెండు కండ్లూ రెండు కుండల్లై చిల్లులు పడి చిందడానికి సిద్ధంగా ఉన్నాయి. పాపం! అప్పటి అయన అవస్థ చూస్తే గుండె చెరువవుతుంది. 'ఏ పో! నా కంట పడకుండా వెళ్ళిపో! నాకు బిడ్డలే లేరనుకుంటాను' అని ఎట్లో అనగలిగాడు. ఆ మీదట ఒక్క క్షణం అక్కడ నిలబడలేక పైగుడ్డ భుజాన వేసుకొని పోబోయ్యి, మరం ఒక్కక్షణం నిలబడి 'ఉత్త చేతుల్తో పోయి ఏం చేస్తావు? నీకు కావలసినంత రొక్కం తీసుకొని పో!' అంటూ తాళాల గుత్తి విసిరి సునంద పాదాలవద్ద పార వేసి వెళ్ళిపోయాడు. అమె తల్లి ఒక్కవక్క లబో దిబో అని మొత్తుకుంటూంది. మేమంతా నిర్ఘాంతపోయి చూస్తున్నాము. ఇంత జరిగినా, ఆ అడ కూతురు చలించలేదు. వల్లెత్తు మాట అయినా పలుక్కుండా తాళాల గుత్తిని తీసుకొని ఇంటిలోనికి వెళ్ళింది. మరం అయిదు నిమిషాలలోపుగానే తిరిగివచ్చి, తాళాల గుత్తిని అక్కడే పడేసి, ఒక్క క్షణం నిలబడి అందరిని కలయ చూసింది. ఎవరినోటా మాట లేదు.

## రాగరంజితం

( 44 వ పేజీ తరువాయి )

కొయ్య బొమ్మల్లా కూర్చుని చూస్తుంటే తాను వెళ్ళిపోయింది, ఆ అర్చని వెంట బెట్టుకొని. అంతే నాయనా! ఆ పొద్దునుండి చిన్నమరెడ్డి పైకి లేవలేదు. ఆ గుడి అప్పు పాడు కొట్టు కొంటూంది."

"అది సరేకాని కూతురు వెళ్ళిపోయిందని చిన్నమరెడ్డి అంటే దిగులు పడిపోయా డను కుందాం. ఊళ్ళో వాళ్ళే మయ్యారయ్యా? ఆ గుళ్ళో విగ్రహ ప్రతిష్ఠ సనాటి పూజా పున స్కారాలు జరిపించరాదూ!" అని అడిగితే "బాగుందయ్యా నీ వరుస! భారతమంతా విని దుర్యోధనుడు చేసిన తప్పేమిటంటే ఏం చెప్పను? ఆ అమ్మి ఎవడో కులగోత్రాలు లేనివాడితో లేచిపోలా! అహా.....లేచిపోయిందా, లేదా? మేం మాత్రం పిల్లను కులంలో ఉంచుతామా! పిల్ల కట్టించిన గుళ్ళో అడుగు పెట్టతామా?" అంటూ ఒక అడుగువేసి అంత లోనే నిలబడి, "ఇప్పుడేమో ఈ కుర్ర కుంకలంతా చేరి ఏదో సంఘమంటూ పెట్టారు.

ఏళ్ళేదో ఉద్ధరిస్తారట ఈ గుడిని! అది కూడ చూడమూ!" అంటూ రుస రుసలాడుతూ వెళ్ళి పోతాడు.

ఇలా తాను ఊళ్ళు వెడలి ఆనంద్‌తో కలిసి ఓ మూడు నెలలపాటు అజంతా, ఎల్లోరా బిల్లా లమ్, హంపీ క్షేత్రాన్ని చూసింది సునంద. అమీదట తిరుపతి చేరి ఓ ముచ్చటయిన మేడ కట్టించుకొని అక్కడే స్థిరపడిపోయింది.

* * * *

అలసి సొలసిన శరీరాన్ని అలా పరుపు మీద పారవేసి, మనస్సు అలా గతంలోకి గిరికీలు కొట్టి తిరిగి వచ్చేసరికి, చెమటతో ముద్దయి శరీరం గడగడలాడిపోతూంది. కొస్సేపు అటునటూయించి మనస్సు కట్టెలా పడి వున్న తనువులో కాలు పెట్టేసరికి వాడిన పైరుకు తడిచేసినట్లు సునందలో కాస్త చైతన్యం కలిగింది. గదిలో ఏవో అవ్యక్తమైన గుసగుసలు, మర్మరోదనలు! కొస్సేపు పరకా యించి చూసింది. తన్ను ఎంతగానో ప్రేమించి, కంటికి రెప్పగా కాపాడి పెంచి పెద్దచేసిన తల్లి తండ్రులు 'అమ్మా!' అని పరితపిస్తూ ఎదుట నిలబడి ఉన్నారు. ఊళ్ళోవాళ్ళందరూ 'ఛీఛీ! ఎవరో దారినపోయే వాడితో లేచిపోయి, కులానికి పరువు ప్రతిష్ఠ లేకుండా చేసింది. అలాంటి ఆడది చస్తే మాత్రం ఏం?' అని దెప్పి పొడుస్తున్నారు. 'నిజమే. తాను చస్తే మాత్రం ఏం?'

"ఎందుకు చావాలి?" అంతరాత్మ ప్రశ్న.

"ఎందుకు బ్రతకాలి?" తన ప్రతి ప్రశ్న.

"ఆనందించడంకోసం!"

"అది అలభ్యమైపోయిందిగా?"

"అని ఎలా అనుకుంటావు?"

"దీనికంటె విదర్శన మేమి కావాలి? పుట్టి పెరిగిన వూరు, కనిపెంచిన తల్లిదండ్రులు బంధువు లందర్నీ వదలుకొన్నాను. గత రెం డేండ్లుగ అతనిలో ఓ మానసికమైన మార్పు తేవడానికి ప్రయత్నిస్తున్నాను. కానీ అయన చిక్కినట్లే, దక్కినట్లే దూరమైపోతున్నారు. నా ఆశలు అడియాసలైనాయి."

"ఆశ చెడ్డది!"

"ఆశ లేకపోతే బ్రతుకే లేదు!"

"ఓర్పు లేకపోతే కూడ బ్రతుకులేదు."

"రెండేండ్లుగా నా ఓర్పును పరీక్షించు కొన్నాను."

"కానీ ఇప్పు డాయన పోటీకై ప్రయత్నిస్తు న్నారు."

"నిజమే! ఈనాడు ఆంధ్రానలో పోటీ, తరువాత అఖిల భారతదేశంలో పోటీ, అమీదట అంతర్జాతీయ పోటీ! ఎల్లకాలం ఇలాంటి పోటీ లతో పడలేను బాబూ! నే చస్తాను."

"చచ్చి సాధించేదేమీ లేదు."

"బ్రతికి బాగుపడేది మాత్ర మేముంది?"

## నిర్భాగ్యుడు

నేర్పరచాడు. ఇంకా పెక్కు కట్టుదిట్టాలు చేశాడు. వీరోచితంగా ఉపన్యసించాడు. ఆంధ్ర వీరుల అమర చరిత్రను సైన్యానికి బోధిం చాడు. వాళ్ల అడుగుజాడల్లో జీవితాలను ధన్యం చేసుకోవాలన్నాడు. గెలిచి తీరాలన్నాడు. స్వామి ఈ మాటలను వినలేదు. ముభావంగా, పర ధ్యానంగా ఉన్నాడు.

ఆరోజుకూడా ప్రతిరోజువలెనే యుద్ధం ప్రారంభమైంది. ఆంధ్ర సైన్యం విజృంభించి నది. ఎక్కడ చూసినా విక్రముడే. అవక్ర విక్రమంతో, త్రిధాగ్రవరాక్రముడై ఎదిరి సైన్యాలను చీల్చి చెండాడాడు.

అతన్ని నిష్క్రమింపచేయాలని తురకలు పెద్ద ఎత్తుగడ వేశారు. పాతికమంది తురక వీరులు విక్రముని అశ్వాన్ని చుట్టుముట్టారు.

వారందరిని విక్రముడు ఒక్కడూ ఎదిరించలేక పోయాడు. అయినా ధైర్యాన్ని కోలుపోక పోరు సాగించాడు.

స్వామి అతని పరిస్థితి చూశాడు. అతని హృదయంలో సుహో మెదిలింది. ఆమె పసుపు, కుంకుమలు మదిలో కదిలాయి.

అతడు ఏమాత్రమూ ఆలస్యం చేయలేదు. మెరుపువలె విక్రముణ్ణి చేరాడు. విక్రముడి గుండెల్లో గుచ్చుకోబోయిన కరవాలానికి తన కత్తి అడ్డుపెట్టాడు. అదే సమయంలో రెండు కత్తులు రెండు వైపులనుంచి అతడి డొక్కలో దూరాయి. రక్తం వెల్లువై పారింది. అప్పటికి విక్రముడు ఆ ప్రదేశాన్ని వీడి పోయాడు. తురకలకు పట్టరాని కోపం వచ్చింది. ఒక సిపాయివాడు, నేలమీద ఒరిగిపోయిన స్వామి శిరస్సును రెండుగా ఖండించాడు. రక్తం చిర జిమ్మింది. ఆ శవాన్ని కాలితో తన్నారు. దానిపై ఉమిశారు. ఇంకా ఎన్నో క్రూరకృత్యాలు కావిం చారు. ఎందరి కాళ్లక్రింద పడి అది నలిగి పోయినదో!

తన ప్రాణం రక్షించిన వీరుణ్ణి ఉపలక్షించ డానికి విక్రముడు యుద్ధం ముగిసిన పిదప ఆ ప్రదేశానికి వచ్చాడు. అక్కడ అనేక శవా లున్నాయి. అందులో సహృదయుణ్ణి, జీవిత దాతను కనుగొనటం అతడికి సాధ్యం కాలేదు. కృతజ్ఞతాపూర్వకంగా రెండు కన్నీటిబొట్లు వదలటం తప్ప అతడు చేయగలిగినదేమీ లేకపోయినది.

ఆ శవాన్ని ఎవరూ దహనం చేయలేదు. నక్కలు ఆహారంగా ఉపయోగించుకొన్నాయి. పురుగులు నివాసమేర్పరచుకొన్నాయి. గుడ్ల గూబలు చుట్టూ చేరి భయంకరంగా అరిచాయి.

భగవంతుడు ఆవిధంగా ఒక ఆట ఆడు కున్నాడు.

ఒక నిర్భాగ్యుని జీవితం ఆవిధంగా ముగిసింది. అతని ఉసురే ఆ సామ్రాజ్యాన్ని కొట్టింది. అందుకే తురకల వశమై పోయినది. ★

"చాల తొందర పడుతున్నావు. బాగా ఆలోచించుకో."

"బాగా ఆలోచించే ఈ నిర్ణయాని కొచ్చాను."

"అయితే నీ ఇష్టం!"

ఆ అంతర్యుద్ధంలో తానే నెగ్గింది. దానితో ఆమె కెక్కడలేని తెంపూ పుట్టుకువచ్చింది. బారెడు పగ్గం....ఒక రవ్వంత పొటాషియం సైనైడు....ఇంటి వెనుక చేదబావి....లేదు తోటలో నాలుగు గన్నేరువేళ్ళు....లెక్కలేనన్ని ఆలోచనలతో లేచి నిలబడింది. పడక టింటి నుండి బయటపడింది!..

తొలికోడి కూసింది. పడమటి దిక్కున వెల వెల పోతూన్న వెలరాజును చూచి కలువలు విల విల తన్నుకొంటూంటే ఆ అవమానం చూడలేక చుక్కలు ఒక్కొక్కటిగ తప్పుకొంటున్నాయి. చాలిక వేస్తే రంగు మారిన ముక్కల చీరలాగ ఆకాశము తేలిపోతూంది. నాట్య భంగిమలో పైకెత్తిన ఎడమ కాలి బొటనవ్రేలి కొన గోటితో అందాన్నంతా ఇమిడించ ప్రయత్నిస్తున్న ఆనంద్ ఇమిడించిన ఆనందంతో 'సునందా!' అంటూ లేచి నిలబడ్డాడు. ఎడమ చేత ఉలి, కుడిచేత సుత్తె అలానే ఉన్నాయి. నాలుగడుగులు వెనక్కువేసి వివిధ కోణాలనుండి అదిగంత సుందరిని విలోకించాడు. ఏ వైపు నుండి చూచినా గీసిన చిత్రమట్లు, ఊపిరున్న ఉవిద పైని తనవైపు చూపు విసిరి చిరునవ్వులు చిందబోతూంది ఆ శిల్పం! ఆనంద్ ముగ్ధుడై పోయాడు.

ఆ ఆనందాన్ని పంచుకున్నదానికి భాగస్వామిని కోసం మనసు మళ్ళింది. అప్పటికి కాని ఆమె అక్కడలేని సంగతి, అంతవరకు ఏమయిపోయిం దన్నసంగతి అతనికి తెలిసిరాలేదు. పిచ్చి ఆవేశంతో, ఒక్క ఊపులో, తూపులా ఇంట్లో జొరపడ్డాడు. తాను ఎక్కడ చూస్తున్నదీ తనకే తెలియకుండా కాలుకాలిన పిల్లిలా ఇల్లంతా కలియ తిరిగాడు, 'సునందా!....సునందా!!' అని పిలుస్తూ. ఆ ప్రశాంత వాతావరణంలో అతని హృదయ కుహరంలోనుండి వెలువడిన పిలుపు గిరిగహ్వరంలో ప్రతి ధ్వనించినట్లు, ఇంతయి, అంతయి అనంతంలో కలిసిపోయింది.

సునంద బదులు పలుకలేదు.

ఆనంద్‌కు ఆతురత హెచ్చింది. 'ఏమయి ఉంటుంది?' అని వివిధ రీతుల ఆలోచించిన మనసుకు 'బహుశా నిదురపోతూ ఉండవచ్చు' అన్న ఆలోచన తట్టడం, దానితో అతడు ఎగిరి గంతేయడం, అతని అన్యమనస్కత కొక ప్రబల నిదర్శనం. అంతటితో దృష్టి పడక గది వైపు మళ్ళింది. 'బారు'గా తెరచివున్న తలుపులు, మంచంమీద పడి నిదురిస్తున్న సునంద కంట పడ్డారు. ఒక్క అంగలో గదిలో పడ్డాడు.

'ఏమిటి సునందా! ఇంకనూ నిదురిస్తూనే వున్నావ్! లే....నాదిగంత సుందరి దివినుండి భువికి దిగివచ్చింది....అందాల ప్రోవు ఈలోకంలో అడుగుపెట్టింది....చూద్దువు కాని, రావందా!"

"........"

"అరె! ఎన్నడూ లేదు. ఏమిటీ మొద్దు నిద్ర! లే సునందా!.....ఓ! రాణిగారికి మేలుకొలుపులు పాడాలి కాబోలు!....అయ్యో! నా మతి మండి పోను. కోకిలమ్మ కంఠంతో అపశ్రుతి ఆలాపించనా!.....ఏం చెయ్యడం? ఆఁ! పోనీ! చెప్పు దేవీ! వినయ కుసుమాలతో పూజింతునా! విజయగర్వంతో భూషింతునా?"

"..............."

"నా జీవితేశ్వరీ! నా లో నవ చైతన్య కుసుమ వికసన ప్రదాయినీ! నవ జీవన రాగ ప్రబోధినీ! లే! నా అందాల రాణీ అభివందనలు తీసుకో!"

"..................."

"సునందా!....సునందా!! ఏమిటి నీ వైఖరి? ఎందుకు నన్నిలా విసిగిస్తున్నావు! లే!"

"............."

"కొంపదీసి నామీద అలుగలేదు కదా!....నా చిట్టివి కదూ!" అంటూ తట్టి లేపబోయాడు. అంతే! నిలువున నీరై నిలబడివున్న చోట కుప్పగ కూలిపోయాడు!


సునంద నిర్జీవమైన బొమ్మలా పడి ఉంది!

అతని హృదయం ముక్కలై పోయింది. శరీరం స్వాధీనం తప్పిపోయింది. మంచం పట్టెపై తల బాదుకొన్నాడు. పసిపిల్లవానివలె బావురు మన్నాడు.

'అయ్యో! కీర్తి దాహంతో అపకీర్తి పాలయ్యానే! బంధము నమ్ముకొని నా బ్రతుకు బండ పాలు చేశానే! ఇక లోకంలో నన్నెవరు మనిషిగా గుర్తిస్తారు? ఎవ్వరు నా అలనా పాలనా చూస్తారు? నిజమే! సునందా! నేను నిండి లేకుండా బ్రతికాను. నువ్వున్న సంగతే మరిచి పోయాను. అయినా ఈమాత్రాని కింత పెద్ద శిక్షా?' అని అతని హృదయం అజ్ఞాతంగా రోదిస్తూంది. "నా సునంద చచ్చిపోయింది! నా సునంద చచ్చిపోయింది! నేనూ చచ్చిపోతాను" అంటూ అతని నోటినుండి మాటలు అస్పష్టంగా వెలువడుతున్నాయి.

'ఛీ ఛీ!! కళాకారుడి లక్షణమేనా ఇది? పుట్టడ మెంత సహజమో తరువాత గిట్టడం కూడ అంతే సహజం. దానికై ఎందుకిలా పరితపిస్తావు? లే! అందాలమీద పూరేగింపు.. అఖండమైన కీర్తి...ప్రఖ్యాతశిల్పివని గుర్తింపు... నీకోసం ఎదురు చూస్తున్నాయి! రా!"అంటూ ఆ శిల్పం ఎదుట నిలబడి ఆహ్వానిస్తూంది! ఆనంద్ లోక తొక్కిన ప్రాచయ్యాడు.

"ఛీ! పాతకీ! నీవలన కదా నాకీ ఎడబాటు? నువ్వే లేకుంటే....అవును. నిన్ను ఛిన్నాభిన్నం చేస్తేనే కాని నాకు శాంతిలేదు" అంటూ ఒక్క ఊపులో శిల్పం ముందు కురికాడు. క్షత్రియ కుల విధ్వంసనార్థం గండ్రగొడ్డలి పట్టిన పరశురామావతార మెత్తాడు ఆనంద్. ఒక్క దెబ్బలో ముక్కలు ముక్కలు చేయాలని కుడిచేతి సుత్తెను పైకెత్తాడు. అసూయ, ద్వేషం, కోపం, దుఃఖం మిళితమై శరీరంలోని బలాన్నంతా కుడిచేతిలోనికి చొప్పిస్తున్నాయి.



నావ ఒడ్డెక్కించుతావా ?

చిత్రం—టి. జానకీదేవి (అనపర్తి)

ఒక్క క్షణం గడిచిఉంటే, ఎత్తిన చెయ్యి వాలిఉంటే ఆ శిల్పం—అద్దాల బీరువాలో అందాల తల్పంమీద ఉంచవలసిన శిల్పం—రోడ్డుమీద గచ్చు కుపయోగపడేది! క్షణం గడవలేదు. ఎత్తిన చేయి వాలలేదు. ఆ చేయి మరొక చేతిలో పట్టుబడిపోయింది! "ఎవరు నువ్వు?" అంటూ రెట్టించినకోపంతో ఆనంద్ తిరిగి చూశాడు. అంతే! అతని దృష్టి మళ్ళీ మారలేదు. నిలువు రెప్పలు పడిపోయాయి. మతి గతి దప్పింది. అంతులేని ఆశ్చర్యం అతన్ని ముంచివేస్తే, చైతన్యరహితంగా నిలబడిపోయిన చేతిలోనుండి సుత్తె పట్టుతప్పి క్రిందపడింది. 'ఇలా!. నిజమా!' అని కలవరపడుతూంటే అతని నోట మాట రాలేదు.

కిల కిల నవ్వుతూ కొంటెగా అతన్ని చూస్తూంది సునంద.

"ఏమండీ! చచ్చి కూడ మరలా పిశాచిలా దాపురించింది పట్టి పీడించడాని కనుకొంటు న్నారా?"

ఆనంద్ తన స్థితినుండి ఇంకనూ కోలుకో లేదు.

"మీ సునంద చావలేదండీ! మీరు చూసింది సునందలాంటి బొమ్మను!"

"ఆఁ!" ఇప్పుడిప్పుడే ఆనంద్ ఈ లోకంలో అడుగు పెట్టుతున్నాడు.

"అవునండి. ఏడాదిపాటు మీకు శుశ్రూష చేస్తూ శిష్యురాలుగా, రెండేండ్లు మీ సతిగా మొత్తం మూడేండ్లలో, విద్యార్థి జీవితంలో అభ్యసించిన కళానైపుణ్యానికి తమ సాహచర్యంతో మెరుగులు దిద్దుకొని తీరిక వేళల్లో మట్టితో తీర్చిదిద్దిన బొమ్మను ఇలా వినియోగించు కొన్నాను."

"నిజమా!" అని ఆనంద్ ఆమెను చూస్తే, "నిజమే!" అని తన చిలిపి చూపులతో బదులు పలికింది సునంద.

"నన్ను క్షమించు, సునందా!" అంటూ ఆనంద్ ఆమెను గాఢంగా తన హృదయానికి హత్తుకొన్నాడు. ఆమె పులకించి పోయింది.

పడమటి దిక్కున చంద్రుడు పాలిపోతే సూర్యుణ్ణి ఆహ్వానిస్తున్న తూర్పు దిక్కున రాగ రంజితం! వాళ్ళ హృది[illegible]

[illegible]తం!